క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ల ఉద్యోగ భద్రతకు కృషి



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కోరుట్ల: ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్ల ఉద్యోగ భద్రతకు కృషి చేస్తానని డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా కోరుట్లలో గురువారం పర్యటించి పట్టభద్రుల మద్దతు కోరుతూ ప్రచారం నిర్వహించారు. సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జాబ్ క్యాలెండర్ విడుదల చేశారని గుర్తు చేశారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరారు.

ఆదరిస్తే అభివృద్ధి చేస్తా


మాట్లాడుతున్న శేఖర్‌రావు

జగిత్యాల: ఆదరిస్తే అభివృద్ధి చేస్తానని శేఖర్‌రావు అన్నారు. జగిత్యాలలోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. ఈ ప్రాంత సమస్యల గురించి చాలా తెలుసన్నారు. ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే గ్రాడ్యుయేట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ట్రస్మా నాయకులు శ్రీధర్‌రావు, జనగ్మోహన్‌రెడ్డి, రాజు, రవీందర్‌రెడ్డి, రాంబాబు, ఉమాకాంత్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన యూత్ సభ్యులు


మొక్కలు నాటుతున్న సభ్యులు

గొల్లపల్లి: దట్నూర్ పాఠశాలలో గురువారం శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మా కా నామ్ కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరు మీద చెట్టు నాటే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో మొక్కలు నాటి మొక్కల ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రాలు తనిఖీ


భూషణరావుపేటలో ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ చేస్తున్న వైద్య శాఖ అధికారులు

కథలాపూర్: సిరికొండ, భూషణరావుపేట, కథలాపూర్, అంబారిపేట గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలను వైద్య శాఖ ఆడిటింగ్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. వైద్య శాఖ ద్వారా వెచ్చించిన నిధులు ఏమేరకు వినియోగిస్తున్నారనే విషయాలను పరిశీలించినట్లు అధికారుల బృందం తెలిపింది. వైద్యాధికారులు సింధూజ, రచన, సూపర్‌వైజర్ శ్రీధర్ ఉన్నారు.

సమగ్ర సర్వేలో ఉద్యమకారులను గుర్తించాలి

జగిత్యాల: సమగ్ర సర్వేలో ఉద్యమకారులను గుర్తించాలని ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జవ్వాజి శంకర్ అన్నారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం, పెన్షన్ ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిందని, ఇప్పటివరకు అమలు చేయడం లేదని తెలిపారు. కుటుంబ సమగ్ర సర్వే ద్వారా గ్రామాలు, పట్టణాల్లో ఉద్యమకారులను గుర్తించాలన్నారు. నాచుపల్లి రెడ్డి, సత్యంరావు, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, వాసాల వెంకన్న పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లయినా ప్రభుత్వ భవనాల నిర్మాణమేది..?

బుగ్గారం: బుగ్గారం మండలం ఏర్పడి తొమ్మిదేళ్లయినా పక్కా ప్రభుత్వ భవనాలను నిర్మించాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు మంచె రాజేశ్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నూతన మండలం ప్రకటించి నేడు, రేపని కాలయాపన చేస్తూ తొమ్మిదేళ్లు గడిపేశారని, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా పక్కా భవనాలు నిర్మిస్తారని ఎదురుచూస్తున్న ప్రజల ఆశలకు నిరాశే ఎదురైందని అన్నారు. శ్రీధర్, అనిల్, శ్రీనివాస్, గంగాధర్, రమేశ్, తిరుపతి, పోషరాజు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలించాలి

సారంగాపూర్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండలంలో నిర్వహించిన పనులను సామాజిక తనిఖీ బృందాలు పారదర్శకంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని డీఆర్‌డీవో అడిషనల్ పీడీ మదన్‌మోహన్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, సామాజిక తనిఖీ బృందాల సమావేశంలో మాట్లాడారు. జిల్లా అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి దేవేందర్‌రెడ్డి, ఎంపీడీవో గంగాధర్, డీఆర్‌పీ సాయికుమార్, ఎస్‌ఆర్‌పీ రమేశ్, ఈజీఎస్ ఏపీవో శ్రీలత, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కుల గణన సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి


తిప్పన్నపేటలో సర్వే పరిశీలిస్తున్న గౌతమ్‌రెడ్డి


సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

- జగిత్యాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి

జగిత్యాలరూరల్: గ్రామాల్లో కుల గణన సర్వేను ఎన్యుమరేటర్లు సమర్థవంతంగా నిర్వహించాలని జగిత్యాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. గురువారం జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామంలో కుల గణన సర్వేను పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి ప్రతి కుటుంబాన్ని కలిసి సర్వే నిర్వహించాలన్నారు. ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో వాసవి, డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్‌రావు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

జగిత్యాల: కుల గణన పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.

మల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల గణనపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజల స్పందన తెలుసుకోవాలని మండల అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి అన్నారు. గురువారం పాతదాంరాజుపల్లిలో మాట్లాడారు. నాయకులు ఇప్పపల్లి గణేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: కుటుంబాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన కోసం సర్వేలో భాగంగా చేపట్టిన స్టిక్కరింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటా స్టిక్కర్లు అంటించగా.. మండల ప్రత్యేకాధికారి మనోహర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్ పర్యవేక్షించారు.

జగిత్యాలరూరల్: సమగ్ర కుటుంబ సర్వే సజావుగా నిర్వహించాలని ఎంపీడీవో రమాదేవి అన్నారు. చల్‌గల్, తాటిపల్లి, మోరపల్లి, అంతర్గాం, తిప్పన్నపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను పరిశీలించారు. ఎంపీవో రవిబాబు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతుల పనులు వేగవంతం చేయాలి


డబుల్ బెడ్‌రూం ఇళ్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, అధికారులు

జగిత్యాలరూరల్: డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతుల పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం అంతర్గాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీ, సెప్టిక్ ట్యాంకుల నిర్మాణాల కోసం రూ.80లక్షలు మంజూరయ్యాయన్నారు. డీఈ మిలింద్, ఏఈ రాజమల్లయ్య పాల్గొన్నారు.

జగిత్యాల: సమీకృత మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం బీట్‌బజార్‌లో నిర్మిస్తున్న వెజ్, నాన్‌వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పరిశీలించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, కమిషనర్ చిరంజీవి, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్‌రావు, ఏఈ చరణ్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణతోనే విద్యలో రాణించొచ్చు



జగిత్యాల: ఆరోగ్య పరిరక్షణతోనే విద్యలో రాణించొచ్చని ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు హేమంత్, ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఐఎంఏ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు స్కూళ్లలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య నిపుణులు ఒడ్నాల రజిత, శ్రీలత, అరుణ, అర్జున్, సాయికిరణ్, దీపక్‌రెడ్డి, సరితదేవి, నగేశ్ పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు: ఎమ్మెల్యే సత్యం


కొడిమ్యాలలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలంలోని ఐకేపీ, ప్యాక్స్ సెంటర్లను గురువారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. మిల్లర్లతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. రైతులు అధైర్యపడొద్దని సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, ప్యాక్స్ చైర్మన్ రాజనర్సింగరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం జీవన్‌రెడ్డి, నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, పిడుగు ప్రభాకర్‌రెడ్డి, కడారి మల్లేశం, ముత్యం శంకర్‌గౌడ్, రాఘవరెడ్డి, ప్రసాద్, జామల్పూరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఇబ్రహీంపట్నం: యామపూర్, ఫకీర్‌కొండాపూర్ గ్రామాల్లో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి, మండల ప్రత్యేకాధికారి రఘువరన్, మార్కెట్ చైర్మన్ రాజు ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులకు ధాన్యాన్ని అమ్మి నష్టపోవద్దని సూచించారు. ఏపీఎం శంకర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, యామపూర్ సింగిల్‌విండో చైర్మన్ రాజన్న, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గంగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: సత్తక్కపల్లి, మేడిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలను గురువారం మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ ప్రారంభించారు. ఏపీఎం విమోచన, సీసీ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు, రైతులు సమన్వయంతో వ్యవహరిస్తేనే కొనుగోళ్లు సాఫీగా సాగుతాయని ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్, బీర్‌పూర్ విండో చైర్మన్ ముప్పాల రాంచందర్‌రావు, బీర్‌పూర్ తహసీల్దార్ ముంతాజొద్దీన్ అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలం చర్లపల్లి, తుంగూర్ గ్రామాల్లో విండో ఆధ్వర్యంలో ఏర్పాటైన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కేడీసీసీ డైరెక్టర్ మందాడి సాగర్, విండో సీఈవో అయ్యోరి తిరుపతి, ఆర్‌ఐ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గుడిసె జితేందర్, మెరుగు రాజేశం, ఏఈవో వినోద్, రైతులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జగిత్యాల రూరల్ మండల ప్రత్యేకాధికారి డాక్టర్ బోనగిరి నరేశ్ అన్నారు. గురువారం అంతర్గాంలో ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో రమాదేవి, ఏపీఎం గంగాధర్ పాల్గొన్నారు.

మేడిపల్లి: కొండాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మేడిపల్లి వ్యవసాయ అధికారి సాధిక్ అలీ సందర్శించారు. గోపి, చందా రమేశ్, మధు తదితరులున్నారు.

మల్యాల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 40 కిలోల ధాన్యంతోపాటు బస్తా బరువు మాత్రమే తూకం వేయాలని, అదనపు తూకం వేస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మునీందర్ అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రంతోపాటు పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం సందర్శించారు. ఆర్‌ఐ తిరుపతి, నిర్వాహకులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆధ్యాత్మికం

రాయికల్: రామాజీపేట గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. యాగశాల ప్రవేశం, నవగ్రహ స్థాపన, యజ్ఞ హోమం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కోల రాజు, మాజీ సర్పంచ్ వాసరి రవి, ఉప సర్పంచ్ హరీశ్‌రావు, మాజీ ఎంపీటీసీ బెజ్జంకి మోహన్, ఆలయ కమిటీ సభ్యులు బోయిని నరేందర్‌రావు, ఇద్దం గంగారెడ్డి, అంబాల జీవన్‌రెడ్డి, అనుపురం సత్యంగౌడ్, చల్ల రాజేందర్‌రెడ్డి, గంగారెడ్డి, లింబయ్య పాల్గొన్నారు.

గోశాలకు గడ్డి దానం చేయండి

జగిత్యాలజోన్: తాటిపల్లి గోశాలకు ట్రాక్టర్ గడ్డిని దానం చేసి ఆవులను కాపాడాలని గోశాల నిర్వాహకులు కోరుతున్నారు. గోశాలలో 120 వరకు ఆవులున్నాయని, ఆవులకు ఏడాది పొడవునా గడ్డి అవసరముంటుందని, రైతులు తమకు తోచినంత గడ్డిని దానం చేయాలన్నారు. గడ్డి అందజేయలేనివారు ట్రాక్టర్ గడ్డి ఖరీదు రూ.3,500 చెల్లిస్తే ఏడాది పొడవునా ఒక ఆవు పోషణ సదరు దాత చెల్లించినట్లవుతుందని చెప్పారు. గడ్డి ఇచ్చేవారు గోశాలలో సంప్రదించాలన్నారు. లేదంటే సెల్ నం.9133191984లో సంప్రదించాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపిక పోటీలు



ఖేల్

జగిత్యాలటౌన్: ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలను గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.అశోక్ ప్రారంభించారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాల విద్యార్థినులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడల కార్యదర్శి లక్ష్మీరాంనాయక్ తెలిపారు. పెటా జిల్లా అధ్యక్షుడు పడాల విశ్వప్రసాద్, కార్యదర్శి అశోక్, పీడీలు భాస్కర్, అఫ్సర్, పడాల కృష్ణప్రసాద్, అజయ్‌బాబు, డేవిడ్సన్ పాల్గొన్నారు.

గొల్లపల్లి: ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో చిల్వాకోడూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి అండర్–17 బాలికల పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీబాయి, పీడీ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మేడిపల్లి: భీమారం మండలం కమ్మరిపేట గ్రామానికి చెందిన జవ్వాజి హరిక రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు భీమారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జవ్వాజి అశోక్ తెలిపారు. నవంబర్ 5న జరిగిన కరీంనగర్ ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ అండర్–14 క్రీడాపోటీల్లో ప్రతిభ చాటి నవంబర్ 8న హుస్నాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పెసరి తిరుమలేశ్ తెలిపారు.

విద్యార్థికి అభినందన

ఇబ్రహీంపట్నం: ఇటీవల హైదరాబాద్‌లో ఇబ్రహీంపట్నంకు చెందిన కరాటే విద్యార్థి విశ్వంత్ జాతీయస్థాయి బ్లాక్ బెల్ట్ సాధించడంతో గురువారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ అనిల్ సన్మానించి అభినందించారు. జిల్లా కరాటే ప్రధాన శిక్షకుడు ప్రవీణ్‌కుమార్, విద్యార్థి తండ్రి వెంకటేశ్ తదితరులున్నారు.

క్రీడాదుస్తులు పంపిణీ

జగిత్యాలరూరల్: కండ్లపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన అండర్–19 బాస్కెట్ బాల్ క్రీడాపోటీల్లో పాల్గొనే విద్యార్థినులకు పట్టణానికి చెందిన శ్రీసూర్యోదయ హాస్పిటల్ వైద్యుడు కోటగిరి భీమేశ్ గురువారం క్రీడాదుస్తులు పంపిణీ చేశారు.

నియామకం

చేనేత ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శిగా భూమయ్య



గొల్లపల్లి: తెలంగాణ చేనేత ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన అంకం భూమయ్యను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత ఐక్యవేదికను జిల్లావ్యాప్తంగా బలోపేతం చేయడానికి సన్నాహాలు చేయాలన్నారు. నియమకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా మధుకిరణ్

సారంగాపూర్: బీర్‌పూర్ మండల మున్నూరు కాపు యువజన సంఘం సోషల్ మీడియా కన్వీనర్‌గా సైండ్ల మధుకిరణ్‌పటేల్ ఎన్నికయ్యారు. గురువారం మధుకిరణ్‌కు నియామక పత్రాన్ని సంఘ అధ్యక్షుడు మ్యాడ శ్రీనివాస్‌పటేల్ అందించారు.

క్రైం కార్నర్..

చైన్‌స్నాచర్ దొంగల గుర్తింపు..?

జగిత్యాలక్రైం: మెట్‌పల్లిలోని 12వ వార్డు టీచర్‌కాలనీలో బుధవారం కందనవేని వాణి అనే మహిళ మెడలోంచి ఇద్దరు ద్విచక్రవాహనంపై వచ్చి నాలుగు తులాల బంగారు చైన్ దొంగిలించుకుని పారిపోయిన విషయం తెల్సిందే. విచారణ వేగవంతం చేసిన పోలీసులు.. నిందితులు ఇద్దరూ నిజామాబాద్ జిల్లాకు చెందినవారుగా గుర్తించినట్లు సమాచారం. వారి కోసం ప్రత్యేక పోలీసు బృందం గాలింపు చర్యలు చేపడుతోంది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కథలాపూర్: దూలూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ వినోద్ గురువారం తెలిపారు. గ్రామాల్లో పర్యవేక్షణ చేస్తుండగా.. అక్రమంగా ఇసుకను తీసుకెళ్తున్న ట్రాక్టర్ కనిపించిందన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు.

ప్రకృతి వనంలో మోటార్ మాయం

మల్లాపూర్: గుండంపల్లి శివారులో మినీ బృహత్ పల్లె ప్రకృతి వనంలోని 3హెచ్‌పీ మోటార్ పంపుసెట్‌ను దొంగిలించారని కార్యదర్శి నోముల నారాయణరెడ్డి గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మినీ బృహత్ పల్లె ప్రకృతి వనంలో మొక్కలకు నీరు పట్టేందుకు 3హెచ్‌పీ మోటార్ పంపును ఏర్పాటు చేశామన్నారు. గత వారం వరకు ఆ మోటార్ పంపు ద్వారానే మొక్కలకు నీరు పట్టామని అన్నారు. గురువారం ఉదయం మొక్కలకు నీరు పట్టేందుకు వెళ్లగా.. అక్కడ మోటారు పంపు కనిపించలేదన్నారు.

పంచాయతీ ట్రాక్టర్లకు జియో ట్యాగింగ్

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల పంచాయతీ ట్రాక్టర్లకు అధికారులు గురువారం జియో ట్యాగింగ్ చేశారు. 23 జీపీలకు చెందిన ట్రాక్టర్లకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేశారు. నిత్యం ట్రాక్టర్లు ఎన్ని కిలోమీటర్లు తిరిగాయి, ఎంత డీజిల్ వినియోగించారు, వాటి సేవలు ఎంతవరకు ఉపయోగించారు లాంటి విషయాలను తెలుసుకునేందుకు జియో ట్యాగింగ్ చేశామని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్ తెలిపారు.



వెల్గటూర్: చెగ్యాం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారింది. కొద్ది రోజులుగా గ్రామంలోని మందుబాబులు, పోకిరీలు విచ్చలవిడిగా మద్యం తాగి మందు బాటిళ్లు పగలగొట్టి వెళ్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లలు వచ్చే అంగన్‌వాడీ కేంద్రంలో మందు బాటిళ్లు పగలగొట్టడంతో గతంలో కూడా పిల్లలకు గాయాలయ్యాయని వాపోయారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
పాలోజి మారుతి, పంచాయతీ కార్యదర్శి, చెగ్యాం, సెల్ నం.: 9542394268

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

అన్ని వర్గాల సంక్షేమానికే కుల గణన


కథలాపూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి కుల గణన కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 29 మందికి కల్యాణలక్ష్మి, 19 మందికి సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కలిగోట సూరమ్మ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కోసం 521 ఎకరాల భూసేకరణ నిమిత్తం రైతులు సహకరించాలన్నారు. కోరుట్ల ఆర్డీవో జివాకర్‌రెడ్డి, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ వినోద్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు తొట్ల అంజయ్య, ఎండీ హఫీజ్, కారపు గంగాధర్, పూండ్ర నారాయణరెడ్డి, వంగ మహేశ్, పులి హరిప్రసాద్, ధనుంజయ్‌రెడ్డి, తలారి మోహన్, కుంభం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: వివిధ కారణాలతో ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు పొందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను గురువారం పంపిణీ చేశారు. దమ్మన్నపేట గ్రామానికి చెందిన లబ్ధిదారులకు రూ.2.79లక్షల విలువ చేసే చెక్కులు మంజూరయ్యాయి. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచనల మేరకు కాంగ్రెస్ నాయకులు గంగాధర్, శ్రీనివాస్, సతీశ్ చేతుల మీదుగా అందజేశారు.

గల్ఫ్ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకుంటాం


అశోక్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న జీవన్‌రెడ్డి

రాయికల్: ఒడ్డెలింగాపూర్‌కు చెందిన పాలకుర్తి అశోక్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం అశోక్ మస్కట్‌లో గుండెపోటుతో మృతిచెందగా.. కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. చింతలపల్లి గంగారెడ్డి, గోపి రాజిరెడ్డి, పాలకుర్తి రవి, పాపయ్య పాల్గొన్నారు.

జగిత్యాలక్రైం: జగిత్యాల ట్రాఫిక్ ఎస్సైగా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టిన మల్లేశం గురువారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి


పెగడపల్లి ఠాణాలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రఘుచందర్

పెగడపల్లి: విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ పోలీసులకు సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా మల్యాల సీఐ రవితో కలిసి పెగడపల్లి పోలీస్ స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, రికార్డులు, పోలీసుల పనితీరును పరిశీలించారు. నేరాల వివరాలను ఎస్సై రవికిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమావేశమై స్టేషన్‌కి వచ్చే వారితో మర్యాదగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గ్రామాల్లో గస్తీ చేపట్టాలని సూచించారు. ఎస్సై రవికిరణ్, హెచ్‌సీ రవీందర్ పాల్గొన్నారు.

తహసీల్ శిస్తును మాఫీ చేయాలి

మల్లాపూర్: చెరువులు, కుంటలపై మత్స్య సహకార సంఘాలు కడుతున్న తహసీల్ శిస్తును మాఫీ చేయాలని మత్స్య సహకార సంఘాల జిల్లా డైరెక్టర్ తోకల రాజు అన్నారు. గురువారం మండలంలోని మొగిలిపేటలో ఏర్పాటు చేసిన గంగపుత్రుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం చేప పిల్లలను జూన్, జూలైలో చెరువులు, కుంటల్లో వదిలిందని, వేసవి వచ్చేసరికి చేపలు పెరిగి దిగబడి వచ్చేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సబ్సిడీని 50శాతానికి తగ్గించడంతోపాటు నవంబర్‌లో వదలడం ద్వారా చేపలు పెరిగే అవకాశం లేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో తహసీల్ శిస్తును మాఫీ చేయాలని కోరారు. సమావేశంలో గంగపుత్ర సంఘం సభ్యులు తోకల శివకుమార్, దుబాక రాము, బొల్లి నర్సయ్య, తోకల గణేష్, గడ్డం రమేష్, దుబాక గణేశ్, బొల్లి భాస్కర్, మాణిక్యం, తోకల భూమయ్య, దుబాక అశోక్, గడ్డం శ్రీనివాస్, తోకల శ్రీధర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి


లింగాపూర్‌లో పశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

పెగడపల్లి: గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి హేమలత రైతులకు సూచించారు. లింగాపూర్‌లో గురువారం పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. పంచాయతీ కార్యదర్శి లావణ్య, నాయకులు తిరుపతి, రాజన్న, శేఖర్, సిబ్బంది మతిన్, వినీత్ పాల్గొన్నారు.

మల్యాల: లంబాడిపల్లి గ్రామంలో గురువారం తెలంగాణ పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం నిర్వహించారు. గర్భకోశ సంబంధిత వ్యాధులకు చికిత్స చేశారు. మందులు పంపిణీ చేశారు. మండల పశు వైద్యుడు రాజ్‌కుమార్, గోపాల మిత్ర సూపర్‌వైజర్ సాదుల్లా, శ్రీనివాస్ బాబు, ఆంజనేయులు, రాజశ్రీ, మల్లేశం, వంశీ, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల నియామకాల్లో అక్రమాలు

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీలోని అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల నియామకాల్లో అక్రమాలు జరిగాయని 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షలు తీసుకున్నారని కార్మికులు చెబుతున్నట్లు తెలిపారు.